
AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
16-4-2026 (Thursday) MAIN EDITION

## నేను ఏ తప్పు చేయలేదు..: మంగ్లీ



**అక్షరటుడే, హైదరాబాద్:** తాను ఏ తప్పు చేయలేదని సింగర్ మంగ్లీ పేర్కొన్నారు. ఈ మేరకు వీడియో విడుదల చేశారు. తానూ మైక్రో ఫైనాన్స్ బాధితురాలినేనని అన్నారు. మైక్రో ఫైనాన్స్ వ్యవహారంలో మంగ్లీపై ఇటీవల ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సింగర్ మంగ్లీ, ఆమె తమ్ముడిపై అనేక ఆరోపణలు వచ్చాయి. రమావత్ మధు అనే వ్యక్తి రియల్ ఎస్టేట్, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో భారీగా డబ్బులు వసూలు చేశాడు. అనంతరం ప్రజలను మోసం చేశాడు. దీని వెనుక మంగ్లీ ఉన్నారని న్యాయవాది సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంగ్లీ సైతం ఆయనపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## రాష్ట్రానికి వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వడగాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పారు. హీట్‌వేవ్ కారణంగా మూడు రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో ఈ నెల 18, 19 తేదీల్లో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ స్వాధీనం



అక్షరటుడే, హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అక్రమ కరెన్సీ రవాణాకు కస్టమ్స్ అధికారులు మరో సారి బ్రేక్ వేశారు. హాంకాంగ్‌కు అక్రమంగా విదేశీ కరెన్సీని తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని అధికారులు పట్టుకున్నారు. హాంకాంగ్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ ప్రయాణికుడి ప్రవర్తనపై అనుమానం రావడంతో అతడి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

### తిరుమలలో శ్రీపద్మావతి పరిణయోత్సవాలు



అక్షరటుడే, తిరుమల: శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఏప్రిల్ 25 నుంచి 27 తేదీ వరకు తిరుమలలో ఘనంగా నిర్వహించనున్నారు. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో వేడుకలు వైభవంగా జరుపనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 25 నుంచి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

### అనిల్ అంబానీకి సుప్రీంలో చుక్కెదురు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: అనిల్ అంబానీకి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూపునకు చెందిన లోన్ అకౌంట్లను బ్యాంకులు ఫ్రాడ్‌గా పేర్కొన్న దర్యాప్తు చేపట్టడానికి సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

**చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. కీలకమైన ఈ మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, అర్జున్ రామ్ మేఘవాల్ మూడు బిల్లులను సభలో ప్రవేశ పెట్టారు. ప్రధాని మోదీ సభలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఇది ఒక కీలక ఘట్టం అన్నారు. చరిత్ర సృష్టించడానికి పార్లమెంట్‌కు ఇది ఒక సువర్ణ అవకాశం అని పేర్కొన్నారు.**

**–అక్షరటుడే, ఢిల్లీ**



# కీలక బిల్లులపై రేపు ఓటింగ్

■ ప్రారంభమైన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ■ మూడు బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్రం ■ డీలిమిటేషన్‌పై విపక్షాల అభ్యంతరం ■ దేశ చరిత్రలో కీలక ఘట్టం

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. 3 కీలక బిల్లులు కేంద్ర ప్రభుత్వం సభలో ప్రవేశ పెట్టింది. 131 రాజ్యాంగ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లులను మంత్రులు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌కు సంబంధించిన 131 రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. బిల్లును సభలో ప్రవేశ పెట్టేందుకు ఓటింగ్ పెట్టాలని కోరాయి. స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు ప్రవేశ పెట్టడానికి మద్దుతగా.. 207 ఓట్లు, వ్యతిరేకంగా 126 ఓట్లు వచ్చాయి. దీంతో సభలో బిల్లును ప్రవేశ పెట్టారు.

### మహిళలకు 272 సీట్లు

కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లో ఆమోదం పొందిందన్నారు. 2026 తర్వాత జరిగే జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన ఆధారంగా దీనిలోని నిబంధనలను అమలు చేయాలని కొత్త బిల్లు తెచ్చినట్లు తెలిపారు. డీలిమిటేషన్‌తో లోక్‌సభ సభ్యుల సంఖ్యలో 50 శాతం పెరుగుదల ఉంటుందని వివరించారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 815కు చేరుకుంటుందని, ఇందులో 272 సీట్లు మహిళలకు కేటాయిస్తామన్నారు. దీంతో ఏ రాష్ట్రానికి నష్టం ఉండదని స్పష్టం చేశారు. పార్లమెంట్ చరిత్రలో ఇది చారిత్రాత్మక రోజు అని అభివర్ణించారు.


### రాజ్యాంగాన్ని హైజాక్ చేస్తున్న కేంద్రం

రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం హైజాక్ చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ అన్నారు. ఈ బిల్లుకు అసలు కారణాలు వేరే ఉన్నాయని ఆరోపించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు 2024లో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు 2026లను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. డీంకే, ఎంఐఎం, సీపీఐ(ఎం) పార్టీలు సైతం బిల్లును వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ అన్నారు. డీలిమిటేషన్‌కు మాత్రమే వ్యతిరేకమని చెప్పారు.

### బీజేపీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. బ్రిటీష్ వాళ్లు దేశాన్ని విభజించినట్లు.. కాంగ్రెస్ తెలంగాణ, ఏపీని విభజించిందన్నారు. అలాంటివారు డీలిమిటేషన్ తీరును తప్పుబడుతున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వితండవాదం చేస్తున్నారని మండిపడ్డారు. జీఎస్‌డీపీ ఆధారంగా సీట్ల సంఖ్య పెంచాలని రేవంత్‌రెడ్డి అన్నారని ఆ ప్రతిపాదన పూలిష్ అన్నారు. ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు ఆలస్యమయ్యేలా కొత్తదారులు వెతుకుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

“



### అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దేశ చరిత్రలో కొన్ని కీలక ఘట్టాలుంటాయన్నారు. ఇది అలాంటి సమయమే అని చెప్పారు. 30 ఏళ్ల క్రితం ఆమోదించాల్సిన బిల్లు.. ఇప్పుడు సభ ముందుకు వచ్చిందన్నారు. మహిళలకు నిర్ణయాధికారం ఉండాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. దేశానికి కొత్త దిశను చూపిస్తున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్టీలన్నీ మద్దతిచ్చాయన్నారు. బిల్లుకు మద్దతు ఇచ్చే పార్టీలకే రాజకీయ మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ బిల్లును వ్యతిరేకించేవారిని మహిళాలోకం క్షమించదన్నారు. బిల్లును తేవడంలో రాజకీయ ఉద్దేశం లేదని చెప్పారు. అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని కోరారు.

## ఆస్ట్రియా ఛాన్స్‌లర్‌తో ప్రధాని సమావేశం..



**అక్షరటుడే, ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్‌తో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రపంచ సంస్థలో సంస్కరణలు అవసరమని తాము భావిస్తున్నామన్నారు. ఉగ్రవాదాన్ని దాని మూలాల నుంచి నిర్మూలించడం ఉమ్మడి నిబద్ధత అని తెలిపారు. స్టాకర్ పర్యటన వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త శక్తిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ప్రపంచం మొత్తానికి నమ్మకమైన సాంకేతికత, సరఫరా గొలుసులను అందించడానికి తాము ఆస్ట్రియా నైపుణ్యాన్ని భారతదేశ వేగం, స్థాయిలతో మిళితం చేస్తామని పేర్కొన్నారు. రక్షణ, సెమీకండక్టర్, క్వాంటం, బయోటెక్నాలజీ రంగాలలో కూడా భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఐఐటీ ఢిల్లీ, ఆస్ట్రియాలోని మోంటాన్ విశ్వవిద్యాలయం మధ్య ఈ రోజు కుదిరిన అవగాహన ఒప్పందం విజ్ఞాన చర్యకు ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అని మోదీ అభివర్ణించారు.

## ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య చర్చలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ అమలులోకి వచ్చినా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. 34 సంవత్సరాల తర్వాత ఇజ్రాయెల్, లెబనాన్ నాయకుల మధ్య ప్రత్యక్ష చర్చలు గురువారం జరుగుతాయని తెలిపారు. ఇజ్రాయెల్, లెబనాన్‌లు ప్రత్యక్ష చర్చలు జరుపుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి తెలిపారు. ఇరు దేశాల నాయకులు మాట్లాడుకుని చాలా కాలం అయిందన్నారు. ఇజ్రాయెల్ లెబనాన్ దక్షిణ ప్రాంతంపై తీవ్రంగా బాంబుల వర్షం కురిపిస్తున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య కాస్త ఊపిరి పీల్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## బాలుడికి యాసిడ్ తాగించిన పిన్ని


**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** సమాజంలో రోజు రోజుకు నేర ప్రవృత్తి పెరుగుతోంది. చిన్న చిన్న కారణాలతో పలువురు హత్యలు చేయడానికి వెనుకాడడం లేదు. తాజాగా వెలుగు చూసిన ఓ ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఓ మహిళ తోటి కోడలి కుమారిడికి జ్యూస్ అని చెప్పి యాసిడ్ తాగించింది. హైదరాబాద్ నగరంలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల బోడుప్పల్‌లో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. తోటికోడలి కుమారుడిపైనే మామకు ఎక్కువ ప్రేమ ఉందనే అసూయతోనే ఓ మహిళ ఆ బాలుడిని చంపాలని నిర్ణయించుకుంది. నాగరాజు, సంధ్య అనే దంపతులకు కార్తీక్(4) అనే కుమారుడు ఉన్నాడు. కార్తీక్‌పై మామ ఎక్కువ ప్రేమ చూపించడాన్ని తట్టుకోలేక.. అతడ్ని చంపాలని నాగరాజు సోదరుడి భార్య మంజుల ప్లాన్ వేసింది. ఈ క్రమంలోనే.. జ్యూస్ అని చెప్పి కార్తీక్‌కు యాసిడ్ తాగించింది. విషయం తెలిసి మంజులపై కార్తీక్ తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## అందుకోసం ఎంతో కష్టపడాల్సి వచ్చింది..

**తల్లి అడుగుజాడల్లో సినీరంగంలోకి అడుగుపెట్టిన బాలీవుడ్ ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. ఈ బ్యూటీ సెలెక్టివ్‌గా సినిమాలు చేసుకుంటూ కెరీర్‌లో దూసుకుపోతోంది. అయితే ప్రతి మనిషికి ఉన్నట్లుగానే ఆమెకు కూడా కొన్ని బలహీనతలు ఉన్నాయి. ఇటీవల ఓ సెమినార్‌లో పాల్గొన్న జాన్వీ కపూర్.. మద్యపానం గురించి, దాని వల్ల వ్యక్తులు పడే ఇబ్బందుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ‘నా వ్యక్తిగత జీవితానికి వస్తే మద్యపానం నా జీవితంలో పెద్ద విలన్‌లా తయారైంది. దానికి బానిసగా మారిపోయా.. వ్యసనం అంటే మనతో ఎవరో తెలియని ఒక అపరిచిత వ్యక్తి సావాహాసం చేస్తున్నట్లే. వ్యసనం కూడా ఓ మానసిక ఆరోగ్య సమస్య అని గుర్తించా. దాని నుంచి బయటపడటానికి ఎంతో కష్టపడినట్లుగా జాన్వీ చెప్పకొచ్చింది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**




## రన్నింగ్ కారులో మంటలు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** రన్నింగ్ కారులో మంటలు చేలరేగి, పూర్తిగా దగ్ధం అయింది. ఈ ఘటన శంషాబాద్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. శంషాబాద్‌లోని రద్దీగా ఉండే హైదరాబాద్ విమానాశ్రయ రోడ్డులోని సిద్ధాంతి సమీపంలో ఒక మహీంద్రా కారుకు నిప్పంటుకోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన కారణంగా దాదాపు రెండు కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. తొండపల్లికి చెందిన ఒక మెకానిక్‌కు చెందిన ఈ వాహనానికి ఇంజన్ మరమ్మతులు జరుగుతున్నాయని సమాచారం. దానిని ట్రయల్ రన్ కోసం తీసుకువెళుతుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.

## ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది దుర్మరణం



**అక్షరటుడే, ఏపీ:** కర్నూల్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో బొలెరో వాహనం, లారీ ఢీకొన్న ఘటనలో 8 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అత్యవసరంగా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయాల తీవ్రత కారణంగా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. మృతుల్లో అమృత, తేజస్విని, ధన్య, దీపక్, దీక్షిత, ప్రతాప్, కుమార్‌లను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. మరో మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు. వీరంతా కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగళూరు జిల్లా కనకాయహల్లి గ్రామానికి చెందినవారని అధికారులు తెలిపారు.